ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు 5
సోమవారం 4 నవంబరు 2024

నేడు వినతుల స్వీకరణ : కలెక్టర్

నంద్యాల కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్‌గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు ఉదయం 9:30 గంటలకే చేరుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కార్తీక మాసంలో ప్రత్యేక బందోబస్తు : ఎస్పీ

నంద్యాల క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలవద్ద భక్తులకు ఇబ్బంది, అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా ఉండేందుకు పోలీసులతో ప్రత్యేక బందో బస్తును ఏర్పాటు చేశామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం పేర్కొన్నారు. జిల్లాలోని శ్రీశైలం, మహానంది, అహోబిళం, యాగంటి, భోగేశ్వరం, ఓంకారం పుణ్యక్షేత్రాల వద్ద ప్రతి ఆది, సోమవారం భక్తుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లు, రహదారి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియం త్రణకు సిబ్బందిని ఏర్పాటు చేశామ న్నారు. ఘాట్‌రోడ్లలో వాహనాలను ఓవర్ టేక్ చేయడం సరికాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించా లన్నారు. మోటార్‌సైకిళ్లపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇతర భక్తులకు అసౌకర్యం కలిగించేలా వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకూడదన్నారు. పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. శ్రీశైలం పాతాళ గంగ ఘాట్ల వద్ద స్నానం ఆచరించడానికి వచ్చే భక్తులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. భక్తులు తమ విలువైన వస్తువులను అపరిచిత వ్యక్తులకు అందించవద్దని, చిన్న పిల్లలపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. నిఘా కోసం సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్‌తోపాటు పోలీస్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు.

గణేకల్లులో రోడ్డు ప్రమాదం

- రెండు ఆటోలు ఢీ, ఇద్దరు మృతి
- 8 మందికి గాయాలు

7

పశ్చిమ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

నేడు జిల్లా ఇన్‌చార్జి, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రాక

7

కిక్కిరిసిన శ్రీగిరి



పాతాళగంగ వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- భక్తుల రద్దీతో దర్శనమిచ్చి శ్రీశైలం
- నేడు లక్ష దీపోత్సవం



క్యూలైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 3: శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో క్షేత్ర పురవీధులన్నీ భక్తులతో రద్దీగా కనిపించాయి. తెల్లవారుజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా శని,ఆది, సోమవారం రోజుల్లో స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తు న్నారు. ఆలయ ఉత్తర మాడవీధి, గంగాధర మండపం భక్తులు దీపారాధనలను చేశారు. దేవ స్థానం అధికారులు క్యూలైన్లలో భక్తులకు మంచినీళ్ళు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మొదటి సోమవారం పురస్కరించుకుని సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతికి ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన : ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన రితుపర్ణ కూచిపూడి నాట్యలయం కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకౌత్వం, భో శంభో, శివాష్టకం తదితర శైవగీతాలకు కళాకారులు నృత్యప్రదర్శనతో అలరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

తవ్వేకొద్దీ అవినీతి..!



గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామ సమీపంలోని మల్లెలవంక ఇది. ఈ గ్రామ సమీపంలో మూడు చెక్ డ్యాంలు నిర్మించినట్లు రూ.29.50 లక్షలకు ఫోర్జరీ సంతకాలతో ఓ కాంట్రాక్టరు రికార్డులు సృష్టించాడు. దీనికి బిల్లులు చెల్లించాలని ఇంజనీర్లు సీఎఫ్ఎంఎస్ ఖాతాలో అప్‌లోడ్ చేశారు.

- వైసీపీ హయాంలో చేయని పనులకు బిల్లులు
- ఇంజనీర్ల సంతకాలు ఫోర్జరీ చేసి ఎం-బుక్, రికార్డులు
- ఎన్నికల కోడ్‌లోనూ అగ్రిమెంట్లు
- పక్కా ప్రణాళికతో అక్రమాలు
- ఇప్పటికే దొంగ బిల్లులతో రూ.4 కోట్లు స్వాహా
- మరో రూ.2 కోట్లకు బిల్లులు

రాష్ట్రంలో సాగునీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాలు పెంచాలనే మహోన్నత లక్ష్యంలో అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం హయాంలో నాటి ప్రభుత్వ పెద్దలు, ముఖ్య నాయకుల అండదండలతో కాంట్రాక్టర్లు, వైసీపీతో అంటకాగిన కొందరు ఇంజనీర్లు పనులు చేయకుండానే బోగస్ బిల్లులు పెట్టి ప్రజాధనం స్వాహా చేశారు. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 2014 నుంచి 2019 వరకు ఐదేళ్లలో నీరు-చెట్టు కింద రూ.1,585 కోట్లకు ఒప్పందం (అగ్రిమెంట్) జరిగితే.. రూ.580.37 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇదే ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోకి వచ్చే చిన్నతరహా నీటిపారుదల (ఎంఐ) కర్నూలు డివిజన్‌లో 370.36 కోట్లకు అగ్రిమెంట్ చేస్తే రూ.177 కోట్లు ఖర్చు చేశారు. నంద్యాల డివిజన్ పరిధిలో 870.95 కోట్లకు అగ్రిమెంట్ చేస్తే రూ.205.31 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డులు ద్వారా తెలుస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. నీరు-చెట్టు కింద మంజూరైనా మొదలు పెట్టని పనులే వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులకు వరంగా మారాయి. వైసీపీ ముఖ్య ప్రజాప్రతినిధుల అండతో ఇద్దరు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా దొంగ బిల్లులు సృష్టించి అందినకాడిని దోచుకున్నారు. మీకు తోడుగా మేమంటూ జిల్లా స్థాయి కీలక ఇంజనీరింగ్ అధికారులు అభయం ఇచ్చారో.. వైసీపీ నేతల ఒత్తిళ్లకు కాంట్రాక్టర్లు చెప్పినట్లు తలొగ్గారో తెలియదు కానీ అవినీతి మాత్రం భారీ ఎత్తున జరిగింది. కాంట్రాక్టర్లు తెచ్చిన దొంగ బిల్లులు దర్జాగా సీఎఫ్ఎంఎస్ ఖాతాలో అప్‌లోడ్ చేయడం విమర్శలకు తావిస్తోంది.

మిగతా 6లో..



జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ కార్యాలయం

కర్నూలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పరిధిలో కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు కుమ్మక్కై నీరు-చెట్టు పేరిట సాగించిన భారీ కుంభకోణమిది. పనులు చేయకుండానే క్షేత్రస్థాయి పర్యవేక్షణ, క్వాలిటీ విభాగం ఇంజనీర్లు సంతకాలు ఫోర్జరీ చేసి ఎం-బుక్, ఇతర రికార్డులు సృష్టించి రూ.కోట్లు ప్రజాధనం స్వాహా చేశారు. తవ్వేకొద్దీ అక్రమాలు బహిర్గతం అవుతున్నాయి. 2019 ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న తేదీలతో బోగస్ అగ్రిమెంట్లు సృష్టించారు. ఫోర్జరీ సంతకాలతో ఇప్పటికే 41 పనులకు రూ.4 కోట్లు స్వాహా చేశారు. అంతటితో ఆగకుండా మరో రూ.2 కోట్లకు పైగా దొంగ బిల్లులు పెట్టినట్లు తెలుస్తోంది. 'మా సంతకాలు ఫోర్జరీ చేసి సృష్టించిన దొంగ బిల్లులు అవి. వాటికి ఎలాంటి చెల్లింపులు చేయకండి..' అంటూ క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఇంజనీర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో తెలుస్తోంది. ఈ అవినీతి భాగోతంపై నేడు జిల్లా పర్యటకు వస్తున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఏ నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ సర్వత్రా వ్యక్తమవుతోంది.

కొలనుభారతి క్షేత్ర పవిత్రతను కాపాడాలి

శారదా మఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ

కొత్తపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి ఆలయ క్షేత్ర పవిత్రతను కాపాడాలని కాకనూరు శారదమఠం పీఠాధిపతి శివ యోగేంద్ర సరస్వతి స్వామీజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పీఠాధిపతి కొలనుభారతి సరస్వతి అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 2వ తేదీన కొలనుభారతిలో క్షుద్రపూజలు జరిగాయన్న వార్తలు రావడంతో ఆయన క్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం క్షేత్ర ప్రాంగణంలో ఆలయ పురోహితులు, సిబ్బందితో విచారించారు. వారి నుండి పొంతలు లేని సమాధానాలు రావడంతో పీఠాధిపతి మండిపడ్డారు. గురువారం అమావాస్య రోజు రాత్రి కాలభైరవుడి ముందు ఎవరో వ్యక్తులు వచ్చి క్షుద్రపూజలు చేస్తుంటే.. మీరేం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పూజల్లో ఆలయానికి చెందిన కొందరు వ్యక్తుల ప్రమేయం లేకుంటే ఎవరో వ్యక్తులు వచ్చి ఎలా పూజలు చేస్తారని ప్రశ్నించారు.



అమ్మవారికి పూజలు స్వామీజీ

మా అమ్మ.. మాకొద్దు..!

- తిరుపతమ్మను తీసుకెళ్లేందుకు నిరాకరించిన బిడ్డలు
- పోలీస్‌స్టేషన్‌లో విచారించిన పోలీసులు

పత్తికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'నడి రోడ్డుపై అమ్మ' కథనం రాష్ట్ర వ్యాప్తంగా ఆవేదన కలిగించినా ఆమె కొడుకు, కుమార్తెల్లో ఇసుమంతైనా దయ కలగలేదు. తల్లిని తమతో తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ కొడుకు, కుమార్తెలు పోలీసుల ఎదుటే తేల్చి చెప్పారు. కన్నతల్లిని నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిన వృద్ధురాలు తిరుపతమ్మ కొడుకుతోపాటు కూతుళ్లకు పత్తికొండ సీఐ జయన్న ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గుంతకల్లులో ఉన్న కొడుకు శ్రీనివాసులు, ఆయన భార్యతో పాటు బళ్లారిలో ఉంటున్న కుమార్తె, అల్లుడు, పత్తికొండలో ఉంటున్న మరో కుమార్తె, అల్లుడు ఆదివారం రాత్రి పత్తికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఆసుపత్రిలో దయనీయ స్థితిలో ఉన్న తల్లిని తీసుకెళ్లాలని సీఐ వారికి సూచించారు. అయితే తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తాము తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ వారు స్పష్టం చేశారు. సీఐ ఎంత నచ్చచెప్పినా వారు వినలేదు. అయినప్పటికీ వారికి సోమవారం గడువు ఇస్తున్నామని, లేదంటే చట్టప్రకారం కేసు నమోదు చేయాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు.

శిఖరాలు చిన్నబోయేలా..!


కంన్‌గ్యాటీస్ పర్వతంపై చంద్రబాబు చిత్రపటాన్ని చూపుతున్న సురేష్

యానమ్ పర్వతంపై త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేస్తున్న సురేష్

పర్వతారోహణ.. ప్రాణాలను సైతం పణంగా పెట్టి సాగే సాహస యాత్ర ఇది. అందులోనూ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలంటే మామూలు విషయం కాదు. దుర్భేధ్యమైన మంచు శిఖరాలను అధిరోహించాలంటే ఒంట్లో సత్తువ ఉండాలి. అంతకుమించి చాలా గుండె ధైర్యం ఉండాలి. శిఖరాల పైకి వెళ్లే కొద్ది ఆక్సిజన్ స్థాయిలు పడిపోతూ ఉంటాయి. కొన్ని సమయాల్లో శ్వాస ఆడక ఉక్కిరిబిక్కిరి అయిపోతుంటారు. ఎముకలు కొరికే చలిలో, నీరు సైతం గడ్డ కట్టే క్లిష్ట వాతావరణంలో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఆ కఠోర ప్రయాణంలో ప్రాణాలను సైతం లెక్క చేయకూడదు. పర్వతారోహణకు ముందు కఠోర సాధన చేయాల్సి ఉంటుంది. అప్పుడే పర్వతాలు తలవంచుతాయి. ఒక్క పర్వతం అధిరోహించాలంటేనే ప్రాణం విలవిల్లాడిపోతుంది. అలాంటిది ప్రపంచ వ్యాప్తంగా 21 పర్వతాలను అధిరోహించాడు కర్నూలు జిల్లా గోనెగండ్ల మండల యువకుడు నరేష్. ఆయన చేసే సాహసయాత్రలకు పర్వతాలు సైతం తలవంచి సలామ్ కొడతాయి. కష్టనష్టాలను ఎదుర్కొని ప్రపంచంలోని ఎత్తయిన శిఖరాలను అవలీలగా అధిరోహిస్తున్న రియల్ హీరోపై ప్రత్యేక కథనం.

- పర్వతాలను సులువుగా ఎక్కేస్తున్న సురేష్
- విద్యార్థి దశ నుంచే ఆసక్తి
- వ్యవసాయ కుటుంబం నుంచి శిఖరాల దాకా
- 21 పర్వతాలను అధిరోహించిన గోనెగండ్ల యువకుడు

గోనెగండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబం నుంచి పేరుప్రఖ్యాతులు పొందే స్థాయికి చేరాడు గోనెగండ్లకు చెందిన సురేష్. ప్రపంచంలో అతికష్టమైన 21 పర్వతాలను సులువుగా అధిరోహించి ఔరా అనిపించాడు. ఈ ఏడాది సెప్టెంబరు నెలలో 25న జమ్ముకాశ్మీర్ దగ్గర ఉన్న కాజినాగ్ పర్వతం, లెహ్‌లడక్‌లోని పర్వతాన్ని అధిరోహించాడు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన కొంతమంది ఈ పర్వతారోహణకు బయలు దేరారు. 2024 సెప్టెంబరు 25వ తేది వరకు పర్వతారోహణ సాగింది. అనంతరం కాజినాగ్ పర్వతంపై చేరుకున్న సురేష్ మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు. శిఖరాన చేరుకున్న సురేష్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఫొటోలను ప్రదర్శించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన ఎవరెస్టు (8,848 మీటర్లు) పర్వతాన్ని దట్టమైన మంచులో 2017 మే 13వ తేదీన అధిరోహించాడు. ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతం (5898 మీటర్లు) పర్వతాన్ని 2017 డిసెంబరు 25న సురేష్ అధిరోహించాడు.


మంచుకొండలో ప్రయాణిస్తున్న సురేష్

వ్యవసాయ కుటుంబం నుంచి శిఖరాగ్రం వరకు

గోనెగండ్లకు చెందిన వ్యవసాయ కుటుంబం వీరిది. తండ్రి కర్రెన్న, తల్లి సువర్ణమ్మల కుమారుడు సురేష్. వీరికి ఉన్న ఎకరం పొలం ఉంది. మరికొంత పొలం కౌలుకు తీసుకుని జీవనం సాగించేవారు. సురేష్ 5వ తరగతి వరకు గోనెగండ్ల, 6 నుంచి 10వ తరగతి వరకు అరికేరలో, ఇంటర్మీడియట్ సీ. బెళగల్, డిగ్రీ కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో పూర్తి చేశాడు. అదేవిధంగా శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లీష్ పూర్తి చేసి ప్రస్తుతం రాయలసీమ యునివర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నాడు.

ఇంటర్ నుంచే ఆసక్తి

గోనెగండ్లకు చెందిన సురేష్ సీ.బెళగల్ మండలంలో ఏపీ గురుకుల పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. 2016లో ఇంటర్ చదివే విద్యార్థుల్లో పర్వతారోహణపై ఆసక్తి గల విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరం ఎక్కేందుకు ముందుకు రావాలని ప్రభుత్వం ఆహ్వానించింది. దీంతో సురేష్ పేరును కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిపాదించాడు. సీబీఆర్ స్పోర్ట్స్ అకాడమీ సురేష్‌కు కొన్ని రోజులు శిక్షణ ఇచ్చి పంపారు. అక్కడి నుంచి సురేష్ ఇక వెనుతిరిగి చూడలేదు. ప్రపంచంలోని అన్ని పర్వతాలను అధిరోహించాలన్నదే లక్ష్యం పెట్టుకున్నాడు.


స్నేహితులతో పర్వతారోహణలో

అధిరోహించిన పర్వతాలు

ఎవరెస్టు (8,848 మీటర్లు) పర్వతాన్ని దట్టమైన మంచులో 2017 మే 13వ తేదీన అధిరోహించాడు. ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతం (5898 మీటర్లు) పర్వతాన్ని 2017 డిసెంబరు 25న సురేష్ అధిరోహించాడు. ఎంటీ ఎల్‌బ్రోష్ 5642 మీటర్లు 2018 ఆగస్టు 5న ఎంటీ మనస్లు 8163 మీటర్లు 2018 సెప్టెంబరు 29న సౌత్ ఆఫ్రికాలోని అకోయకాగియా పర్వతం 6962 మీటర్లు 2019 జనవరి 4, ఆస్ట్రేలియాలోని 10 ఎత్తైన పర్వతాలతో పాటు కోసిస్‌కో పర్వతం 2228 మీటర్లు 2019 మార్చి 3న, నేపాల్‌లోని లోహిట్‌సే పర్వతం 8516 మీటర్లు 2019 మే 29న ఇండియాలోని రుడుగైరా పర్వతం 5819 మీటర్లు 2020 అక్టోబరు 19న, జమ్ము కాశ్మీర్‌లోని కంగ్రీ పర్వతాన్ని 6100 మీటర్లు 2021జనవరి 15న మంగన్‌కట్ పర్వతాన్ని 3700 మీటర్లు, 2021 ఏప్రిల్ 18న, టీస్‌టాపిక్ పర్వతాన్ని 4700 మీటర్లును 2021 ఏప్రిల్ 22న, పటీల్స్ పర్వతాన్ని 2021 ఏప్రిల్ 25న, 2022 జూలై 2వ తేదిన హిమాచల్ ప్రదేశ్‌లోని యానమ్(6111మీటర్లు) పర్వతాన్ని అధిరోహించాడు. వీటితో పాటు మరో ఏడు పర్వతాలను అధిరోహించాడు.

అధికారుల సహకారంతోనే : సురేష్


కుటుంబసభ్యులతో సురేష్

గతంలో ఎంతో మంది నాకు సహకారం అందించారు. ప్రస్తుతం నేను రాయలసీమ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువుతున్నా. ముఖ్యంగా నన్ను అధికారులు, ఉపాధ్యాయులు బాగా ప్రోత్సహించి సహకరించారు. 21 పర్వతాలను అధిరోహించడం చాలా ఆనందంగా ఉంది. జీవితంలో ఇలాంటివి మరెన్నో సాధించాలన్న తపన ఉంది. అందుకోసం ఎంతైనా కష్టపడటానికి సిద్ధం.

ఎంహెచ్‌ఓ కొనసాగింపునకు ప్రయత్నాలు

ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు కమిషనర్ లేఖ

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పని చేస్తున్న మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి(సివిల్ అసిస్టెంట్ సర్జన్) సేవలు మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కమిషనర్ లేఖ రాసారు. రాష్ట్ర ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఈ మేరకు కోరినట్లు తెలిసింది. అయితే 2022 అక్టోబర్‌లో నగర పాలక సంస్థకు వచ్చిన ఎంహెచ్‌ఓ 2023 అక్టోబర్‌కు డిప్యుటేషన్ ముగిసింది. అయితే మరో ఏడాది అంటే 2024 వరకు పొడిగించుకున్నారు. ఈ క్రమంలో 2025 అక్టోబర్ వరకు మరో ఏడాది సేవలు అందించేలా ఆ శాఖ డైరెక్టర్‌కు పంపినట్లు తెలిసింది. ప్రధానంగా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వైద్యులు కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే ఫారిన్ సర్వీస్ కింద నగర పాలక సంస్థలో పని చేయాలని నిబంధనలు ఉన్నాయి. అయితే గతంలో పని చేసిన భాస్కర్‌రెడ్డి కూడ మూడు సంవత్సరాలు ఇక్కడే పని చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం కే. విశ్వేశ్వరరెడ్డి కూడ మరో ఏడాది ఇక్కడే ఉండేలా ఓ మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ సిఫారసు చేసినట్లు తెలిసింది. అయితే త్వరలో ఎంహెచ్‌ఓను మరో ఏడాది కొనసాగించేలా ఆ శాఖ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు విడుదల అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నగర పాలక సంస్థలో ఇద్దరికి పదోన్నతి


కమిషనర్ ఎస్. రవీంద్రబాబు నుంచి పదోన్నతి పత్రాలు అందుకుంటున్న ఉద్యోగులు

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పదోన్నతులు పొందిన ఉద్యోగులు నియామకపత్రాలు అందుకున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో రెండు సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆ స్థానాలను భర్తీ చేసేందుకు సీనియారిటీ ప్రకారం ఇద్దరికి పదోన్నతి ఇవ్వాలని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చింది. దీన్ని సభ్యులు ఆమోదించారు. దీంతో సీనియర్ అసిస్టెంట్లు టి. అబ్దుల్ వాజిద్, కే. రామక్రిష్ణలకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం


ప్రసంగిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, చిత్రంలో మంత్రి టీజీ భరత్

మాజీ మంత్రి టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటామని మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం నగర శివారులోని శ్రీగాయత్రి గోశాలలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి టీజీ భరత్, టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి తమ కుటుంబం నిరంతరం అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని నిలిపేందుకు తనవంతు కృషి చేస్తున్నానని అన్నారు. అనాదిగా ఇతర సామాజిక వర్గాల్లో మత మార్పిడులు జరిగాయని, ఆర్యవైశ్య సామాజిక వర్గంలోనే మత మార్పిడి జరగకుండా పద్ధతి ప్రకారం ముందుకు సాగుతున్నారని అన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నగరంతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తన తండ్రి టీజీ వెంకటేశ్ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, వాటిని స్ఫూర్తిగా తీసుకొని తాము ముందుకు సాగుతున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఏ విపత్తు వచ్చినా ముందుగా స్పందించేది ఆర్యవైశ్యులేనని, ఇది ఎన్నో సందర్భాల్లో నిరూపితమైందని అన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మంత్రి భరత్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సామాజిక వర్గం ప్రముఖులు పాల్గొన్నారు.

తవ్వేకొద్దీ అవినీతి..!

(5వ పేజీ తరువాయి)

గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం ఇద్దరు కాంట్రాక్టర్లు పేరిట డోన్ మండలంలో 33, బేతంచర్ల మండలంలో 12, వెల్దుర్తి మండలంలో 4, ఆస్పరి మండలంలో 5 పనులకు బోగస్ రికార్డులు తయారు చేసి దాదాపు రూ.5.25 కోట్లకు బిల్లులు పెట్టారు. 41 పనులకు సుమారుగా రూ.4 కోట్లు బిల్లులు మంజూరు చేయించుకుని స్వాహా చేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఇంజనీర్లు, క్వాలిటీ సెల్ ఇంజనీర్ల సంతకాలు ఫోర్జరీ చేసి సీఎఫ్ఎంఎస్ ఖాతాలో బిల్లులు అప్‌లోడ్ చేసి ప్రజాధనం కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఆ రికార్డులు పరిశీలిస్తే దాదాపు 50 పనులకు 2019 మార్చి 14,18,21,24 తేదిల్లో అగ్రిమెంట్ చేసినట్లు ఉంది. అయితే అదే 2019 మార్చి 10న భారత సార్వత్రిక ఎన్నికలు-2019 షెడ్యూల్ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. అదే రోజు నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ అమలులో ఉండగా ఎలాంటి అభివృద్ధి పనులు మంజూరు, అగ్రిమెంట్ చేయకూడదు. ఎన్నికల కోడ్ అమల్లో తేదీల్లో అగ్రిమెంట్ చేసినట్లు చూపిన బిల్లులు ఇంజనీర్లు ఎలా అప్‌లోడ్ చేశారు..? ఇవి పక్కాగా బోగస్ బిల్లులే అన్నది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఆ పనులకు క్వాలిటీ సర్టిఫికెట్ (క్యూసీ) సంబంధిత క్వాలిటీ సెల్ ఇంజనీరు జారీ చేయకపోయినా ఫోర్జరీ సంతకాలతో క్యూసీలు సృష్టించినట్లు తెలుస్తుంది. నాడు వైసీపీతో అంటకాగిన ఇంజనీర్ల అండతోనే ఈ భాగోతం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

మరో రూ.2 కోట్లకు స్కెచ్

దొంగ బిల్లులతో రూ.కోట్లు స్వాహా చేసిన కాంట్రాక్టర్లకు ధనదాహం తీరలేదేమో.. తాజాగా మరో దాదాపు రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఫోర్జరీ సంతకాలు, బోగస్ రికార్డులతో దొంగబిల్లులు పెట్టారు. గోనెగండ్ల మండలం బైలుప్పుల గ్రామం సమీపంలోని మల్లెల వాగుపై మూడు, గంజేహల్లి గ్రామ సమీపంలోని మల్లెల వాగుపై మూడు చెక్ డ్యాంలు, ఆదోని మండలం తుమ్మలవాగుపై ఒక చెక్ డ్యాం నిర్మించినట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లతో రూ.57.10 లక్షలకు బిల్లులు పెట్టారు. గోనెగండ్ల మండలం బైచిగేరి గ్రామం తుమ్మలవాగులో చెక్ డ్యాం కట్టినట్లు చూపారు. గోనెగండ్ల మండలంలో బైచిగేరి గ్రామమే లేదు. ఆదోని మండలంలో ఉన్నా.. ఆ పల్లెలో విచారిస్తే తుమ్మలవాగే లేదంటున్నారు. ఆస్పరి మండలం జోహరాపురం పాతమాగి వంక, కైరుప్పల గ్రామం సమీపంలో ఎర్రనీళ్ల వంక, బైలుపత్తికొండ గ్రామం వనం వంక, ఆస్పరి సమీపంలో ముల్లవాగు, రెడ్డివాగుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు.. ఆ ఐదు పనులకు రూ.44.02 లక్షలు బిల్లులు పెట్టారు. అదేవిధంగా పుప్పాలదొడ్డి గ్రామంలో పుప్పాలదొడ్డి వంక, ఆస్పరి సమీపంలో పెద్దనల్లవాగు వంక, చిన్ననల్లవాగు వంక, యాటకల్లు గ్రామ సమీపంలో ఒడ్లోని వంకలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు నాలుగు పనులకు దాదాపు రూ.35.80 లక్షలకు దొంగ బిల్లులు పెట్టారు. వీటితో పాటు ఆదోని, పత్తికొండ, ఆలూరు మండలాల్లో కూడా దొంగ బిల్లులు పెట్టి నిధులు స్వాహాకు ఎత్తులు వేసినట్లు సమాచారం. 'మేము పని చేసిన సమయంలో ఒక్క పని కూడా చేయలేదు. మా సంతకాలు ఫోర్జరీ చేసి బిల్లులు పెట్టారు. ఆ బిల్లులు చెల్లించవదు.. మాకు న్యాయం చేయండి..' అంటూ అప్పట్లో పనిచేసిన ఇంజనీర్లు శనివారం జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డిని కలసి వినతిపత్రం ఇవ్వడం కొసమెరుపు.


గోనెగండ్ల మండలం గంజేహల్లి సమీపంలోని మల్లెల వంక ఇది. దీనిపై మూడు చెక్ డ్యాంలు నిర్మించినట్లు రూ.29.50 లక్షలకు ఫోర్జరీ సంతకాలతో ఓ కాంట్రాక్టరు రికార్డులు సృష్టించాడు. దీనికి బిల్లులు చెల్లించాలని ఇంజనీర్లు సీఎఫ్ఎంఎస్ ఖాతాలో అప్‌లోడ్ చేశారు.

ఆ రికార్డులు తనిఖీ చేస్తే

2019 మే 30న వైసీపీ ప్రభుత్వం కొలువుదీరింది. నీరు-చెట్టు పనుల్లో అక్రమాలు జరిగాయని పనులు, బిల్లులు చెల్లింపు ఆపేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నీరు-చెట్టు కింద 2019 మార్చి ఆఖరి వరకు ఎన్ని పనులు మంజూరు చేశారు, ఎన్ని పనులు అగ్రిమెంట్ చేశారు, ఏఏ పనులు మొదలు పెట్టి ఎంత ఖర్చు చేశారు, చెల్లించిన బిల్లులు ఎంత..? జలవనరుల శాఖ డివిజన్ స్థాయి ఇంజనీర్ల నుంచి వివరాలు సేకరించారు. అదే ఏడాది విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా నీరు-చెట్టు పనులు రికార్డులు రెండుసార్లు తీసుకున్నారు. అవే అసలైన రికార్డులు అని ఇంజనీర్లు అంటున్నారు. ఆ పనుల వివరాలు, వైసీపీ ప్రభుత్వం వచ్చాక బిల్లులు అప్‌లోడ్ చేసిన పనుల వివరాలు సమగ్రంగా తనిఖీ చేస్తే అవినీతి భాగోతం బట్టబయలయ్యే అవకాశం ఉంది.

పీఎం ఉపాధి కల్పనతో యువత ప్రగతి బాట

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని నిరుద్యోగ యువతీ యువకులు ఉపయోగించుకుని పారిశ్రామికరంగంలో గుర్తింపు పొందాలని పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి జీఎం అరుణ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతీ యువకుల కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని అన్నారు. పరిశ్రమల కేంద్రం ద్వారా ఈ పథకాలను వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా తయారీ రంగ కార్యకలాపాలకు 50 లక్షల రుణ సాయంతో పాటు సేవా రంగ విభాగానికి రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుందని లబ్ధిదారుని వాటా కేవలం 5 నుంచి 10 శాతం మాత్రమే ఉంటుందని తెలిపారు. నూతన మైక్రో యూనిట్లకు మాత్రమే ఈ ఆర్థిక సాయం లభిస్తుందని ఈ పథకం ద్వారా వ్యాపార అభివృద్ధికి బాటలు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ ఉత్పత్తుల తయారీ కోసం రూ.1 కోటి దాకా బ్యాంకు రుణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందడానికి 18 ఏళ్లకు పైన వయస్సు ఉన్న వారు అర్హులని అన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ షెడ్యూలు ఇదే



కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికల క్రీడల షెడ్యూల్ (వేదిక) ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు గిడ్డయ్య, శ్రీనాథ్ ఆదివారం ప్రకటించారు. అండర్ 14, 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ టెన్నిస్ పోటీలు 6, 7 తేదీల్లో పులివెందుల వేదిక ఖరారు చేశారు. అలాగే ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు అండర్-17 హాకీ నెల్లూరులో, స్విమ్మింగ్ అండర్-14, 17 బాలబాలికలకు 5 నుంచి 7వ తేదీ వరకు పల్నాడు జిల్లాలో జరుగుతుందని తెలిపారు. 7 నుంచి 9వ తేదీ వరకు అండర్-14 ఖో-ఖో పల్నాడు జిల్లా, నవంబరు 9 నుంచి 11వరకు అండర్-14 బాలబాలికలకు విశాఖపట్నం గాజువాక, అండర్-17 నెట్‌బాల్ బాలబాలికలకు ఈ నెల 8 నుంచి 10 వరకు నెల్లూరులోని ఆత్మకూరులో జరుగుతాయని అన్నారు. వాలీబాల్ అండర్-14 బాలబాలికలకు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు విజయనగరంలోని భోగాపురం, అండర్-17 బాలుర నెట్‌బాల్ 8 నుంచి 10 వరకు నెల్లూరు ఆత్మకూరులో, అండర్-17 బాలబాలికలకు నవంబరు 9 నుంచి 10 వరకు రేణిగుంటలో, అథ్లెటిక్స్ అండర్-14 బాలబాలికలకు ఈ నెల 6 నుంచి 7వరకు ఏలూరులోని టంగుటూరులో, బాల్‌బాడ్మింటన్ ఈ నెల 6 నుంచి 7 వరకు అండర్-14 బాలబాలికలకు శ్రీకాకుళంలో, 8, 9 తేదీలలో అండర్-14, 17 బాలబాలికలకు మల్కాంబ్ పోటీలు, వెస్ట్ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శులు తెలిపారు.

అద్భుతం ఆవిష్కృతం

- ఓంకారేశ్వరుడిపై ఆదిత్యుడి కిరణాలు
- కార్తీక మాసంలో సూర్యకిరణాల ప్రసరణ

శిరివెళ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయంలో అద్భుతం ఆవిష్కృతమైంది. ఓంకారేశ్వరుడిపై భానుడి కిరణాలు స్పృశించాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పవిత్రమైన కార్తీక మాసంలో ఆలయ గర్భగుడిలోని ఓంకారేశ్వర స్వామిపై సూర్య కిరణాలు నేరుగా ప్రసరిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. కార్తీక మాసం ప్రారంభంలోని పాడ్యమి నుంచి అమావాస్య వరకు 30 రోజుల పాటు ఇలా ఆదిత్యుడు ఓంకారేశ్వరుడిని తాకుతాడని ఆలయ అర్చకుడు కేశవ శర్మ వెల్లడించారు. ఆదివారం సూర్యోదయం అనంతరం 6:20 గంటల నుంచి దాదాపు 20 నిమిషాల పాటు సూర్య కిరణాలు స్వామి వారిపై ప్రసరిస్తున్నాయి. కాగా శిరివెళ్లలోని ఓంకారేశ్వర స్వామి ఆలయం 1,464లో ప్రతాపరుద్ర మహారాజు నిర్మించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది.


ఓంకారేశ్వరస్వామిపై ప్రసరిస్తున్న సూర్య కిరణాలు

జింక మృతి

మిడుతూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడుమూరు గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో జింక మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం జరిగింది. డీఆర్‌వో జిహాన్ తహేర్‌ను వివరణ కోరగా జింక కుక్కల దాడిలో మృతి చెందిందా? లేక మరేదైనా కారణం ఉన్నదా? అనేది తెలియాల్సి ఉన్నదని అన్నారు.

విష పురుగు కాటుతో ఉపాధ్యాయుడి మృతి

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌కు చెందిన భాను ప్రకాష్ (30) అనే ఉపాధ్యాయుడు విష పురుగు కాటుతో మృతి చెందాడు. భాను ప్రకాష్ పాముల పాడు మండలం జూపాడుబంగ్లాలో గురుకుల పాఠశాలలో టీజీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో నిద్రపోతున్న ఆయనను విషపురుగు కాటేసింది. తల్లి చిట్టెమ్మను, సోదరుడు కళ్యాణ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మౌనిక (19) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మౌనిక పదో తరగతి దాకా చదివి, ఆ తర్వాత మానసిక సమస్యతో బాధపడుతూ చదువు మానేసి ఇంట్లోనే ఉంటుంది. శనివారం తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, ఎల్లమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే.. మౌనిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో ఆమెను కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు మౌనిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తేనెటీగల దాడిలో రైతుకు అస్వస్థత


చికిత్స పొందుతున్న చంద్రశేఖర రెడ్డి

మిడుతూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుచెర్ల గ్రామనికి చెందిన చంద్రశేఖరరెడ్డి ఆదివారం తన పొలంలో సేద్యం చేస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పక్కపొలంలో పని చేస్తున్న అతని భార్య సెల్‌ఫోన్‌లో బంధువులకు సమాచారం ఇచ్చింది. వారు చేరుకుని చంద్రశేఖర్‌రెడ్డిని మిడుతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పశ్చిమ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- అసంపూర్తిగా హంద్రీ-నీవా, పందికోన జలాశయం, కుడి, ఎడమ కాలువలు
- కరువు, వలసలను నివారించాలి
- నేడు జిల్లా ఇన్‌చార్జి, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రాక


నిమ్మల రామానాయుడు

కర్నూలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సోమవారం జిల్లాకు రానున్నారు. ఉదయం మౌర్య ఇన్ హోటల్‌లో జరిగే టీడీపీ కూటమి నాయకుల సమావేశంలో్ని 0పాల్గొంటారు. సాయంత్రం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగే జిల్లా అభివృద్ధి సమీక్ష (డీడీఆర్‌సీ) సమావేశంలో పాల్గొంటారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారి జిల్లాకు వస్తున్న నిమ్మల రామానాయుడుకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జలవనరుల శాఖ మంత్రి కావడంతో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అసంపూర్తి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, ప్రగతి పరుగులు పెట్టిస్తారని రైతులు ఆశిస్తున్నారు. గుండ్రేవుల జలాశయం, సిద్ధేశ్వర్వం అలుగుపై కీలక నిర్ణయం తీసుకోవాలని కోరుకుంటున్నారు.

- మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసలు నివారించే లక్ష్యంగా 2019 జనవరిలో నాటి టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువకు శ్రీకారం చుట్టింది. 40 వేల ఎకరాలకు సాగు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించే ఈ కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లు మంజూరు చేసి, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన పనులు మొదలు పెట్టారు. ప్రధాన కాలువ, కోటేకల్లు, కోసిగి, పెద్దకడుబూరు, చిన్నమరివీడు జలాశయాల నిర్మాణాలు చేయాలి. వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పురోగతి అటకెక్కింది.
- ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో పనులు మొదలు పెట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా పురోగతి పడకేసింది. వేదవతి ప్రాజెక్టు పనులు 6 శాతమే జరిగాయి.
- గాజులదిన్నె జలాశయం సామర్థ్యం 4.5 టీఎంసీలు నుంచి 5.50 టీఎంసీలకు పెంచాలనే గత వైసీపీ ప్రభుత్వంలో రూ.35 కోట్లతో పనులు చేపట్టారు. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. రెండు క్రస్ట్‌గేట్లకు కొత్త గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఈ పనులపై దృష్టి సారించాల్సి ఉంది.
- హంద్రీనీవా ప్రాజెక్టు పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువలు, పంటల కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 61,394 ఎకరాలకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. అసంపూర్తి పనులకు రూ.200 కోట్లు ఇవ్వాలి. హంద్రీనీవా నుంచి 68 చెరువులను నింపే ఎత్తిపోతల పథకం నిర్వహణ సిబ్బందిని నియమించడానికి నిధులు మంజూరు చేయాలి.
- కేసీ కాలువ పరిధిలో అలగనూరు జలాశయం 2.96 టీఎంసీలు సామర్థ్యం. మట్టి ఆనకట్ట కుంగిపోయి ఐదేళ్లు దాటింది. వైసీపీ ప్రభుత్వంలో మరమ్మతులకు నోచుకోలేదు. రూ.26.33 కోట్ల నిధులు అవసరమని ఇంజనీర్లు అంటున్నారు. దీనిపై మంత్రి దృష్టి సారించాలి.


ముళ్లకంపతో నిండిపోయిన పత్తికొండ జలాశయం

గుండ్రేవుల, సిద్ధేశ్వరంపై దృష్టి పెట్టాలి


అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కేసీ కాలువకు 31.90 టీఎంసీలు నీటి వాటా ఉన్నా.. నిల్వ చేసుకునే జలాశయం లేదు. సుంకేసుల బ్యారేజీ ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంలో తుంగభద్రపై గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.2,980 కోట్లు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అంతర్ రాష్ట్ర సమస్య అనే ముద్ర వేసి అటకెక్కించారు. తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలి. శ్రీశైలం జలాశయం ఎగువన సంగమేశ్వరం దగ్గర సిద్ధేశ్వరం అలుగు, బ్యారేజీ నిర్మించాలని రాయలసీమ రైతులు కోరుతున్నారు. ప్రతిపక్ష నేతగా నాడు చంద్రబాబు, పాదయాత్రలో యువనేత నారా లోకేశ్ ఈ ప్రాజెక్టులపై సానుకూలంగా స్పందించారు. టీడీపీ ప్రభుత్వం రాగానే సరైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి ఈ ప్రాజెక్టుల అవసరాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సీమ రైతుల స్వప్నం సాకారమయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాలింత కుటుంబ సభ్యులు

మృతదేహంతో ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆదివారం ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామానికి చెందిన సుజాత ఎమ్మిగనూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో శనివారం డెలివరీకి వచ్చినట్లు భర్త మల్లేష్ తెలిపారు. తన భార్య గర్భం దాల్చినప్పటి నుంచి ఆ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలిపారు. శనివారం పురిటి నొప్పులతో ఆసుపత్రికి రాగా సిజేజరియన్ చేశారని, ఆ సమయంలో రక్తస్రావం జరిగిందని, అయితే మరొక సారి కుట్లు వేయడం వల్ల రక్తస్రావం అధికమైందని చెప్పారు. వైద్యులు కర్నూలుకు తీసుకెళ్లాలని చెప్పడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లామని, అయితే బాలింత అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. దీంతో ఆదివారం ఉదయం సుజాత మృతదేహాన్ని ఆసుపత్రి ముందు ఉంచి ఆదోని-మంత్రాలయం హైవేపై కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే సుజాత మృతి చెందిందని ఆరోపించారు. న్యాయం చేసేదాకా ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. సీఐ సుదర్శన్ రెడ్డి చేరుకుని, సమస్య ఉంటే స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాలని చెప్పి స్టేషన్ తీసుకెళ్లారు. బాధితులకు న్యాయం చేస్తామని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో సుజాత మృతదే హాన్ని కుటుంబ సభ్యులు తీసుకొని వెళ్లిపోయారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కురవ దూలప్ప (ఫైల్)

ఆలూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరికేర గ్రామానికి చెందిన రైతు కురవ దూలప్ప (39) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆదివారం దూలప్ప రెండు ఎకరాల మిరప పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటారు విద్యుత్ తీగ సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. దూలప్పను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న దూలప్ప మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని ఆలూరు విద్యుత్ డీఈఈ సంతోష్ కుమార్, ఏఈ గుర్రప్ప, ఆలూరు పోలీసులు పరిశీలించారు. మృతుడు దూలప్ప అరికేర గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. దులప్ప మృతి పార్టీకి తీరని లోటని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ అన్నారు. దూలప్ప కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. దూలప్ప మృతికి గ్రామ సర్పంచి కుప్పగల్లు నాగరాజు, ఉప సర్పంచ్ లక్ష్మీ నారాయణ, టీడీపీ నాయకులు ఈరన్న, వన్నూర్ వలి, గోపి, రామదాస్ సంతాపం తెలిపారు.

నిందితుడి అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామంలో గత సెప్టెంబర్ 18వ తేదీన జరిగిన దొంగతనం కేసులో నిందితుడు పగిడి నరసింహను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో దొంగతనం జరిగిన తీరును, నిందితుడి వివరాలను వెల్లడించారు. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన పగిడి నరసింహ అదే గ్రామంలో గత సెప్టెంబర్ 18వ తేదీన బద్రి శ్రీనివాసులు ఇంట్లో చొరబడి దొంగతనం చేశాడు. బీరువాలోని ఒక బంగారు తాళిబొట్టు గొలుసు, ఒక బంగారు నెక్లెస్, బంగారు కమ్మలు, మాటీలు, జుమికీలు, ఒక బంగారు ఉంగరం.. మొత్తం ఆరున్నర తులాల బంగారు వస్తువులు, బీరువాలో ఉన్న నగదు రూ.1,50 లక్షలు, చీరల కింద దాచుకున్న నగదు రూ.7.80 లక్షలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. మొత్తం చోరీ రూ.11.70 లక్షలు దొంగతనం జరిగినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్సై బి.చిన్న పీరయ్య కేసు నమోదు చేసుకున్నారు. ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు సూచనలతో ఆళ్లగడ్డ డీఎస్పీ కె.రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్సై బి.చిన్న పీరయ్య, హెడ్‌కానిస్టేబుల్ నాగేంద్రుడు, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరయ్య, నగేష్, శేషన్న, హుసేన్‌బాషాలతో కూడిన దర్యాప్తు బృందం విచారణ చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు నిందితుడు పగిడి నరసింహను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని నంద్యాల పట్టణంలో అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న టీ స్టాల్ వద్ద అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి చోరీ చేసిన బంగారు సొత్తు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

దైవదర్శనానికి వెళ్తూ పరలోకానికి



మృతులు రత్నాబాయి, ఈసన్న (ఫైల్)

- ఆదోని మండలం గణేకల్లులో రెండు ఆటోలు ఢీ
- ఇద్దరు దుర్మరణం, 8 మందికి గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం


ప్రమాదంలో బోల్తాపడిన ఆటో

ఆదోని రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అతివేగం, రాంగ్ రూట్ రెండు ప్రాణాలను బలిగొంది. దైవదర్శనానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన మరో ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా ఎనిమిది మంది తీవ్ర గాయాలపాలైన సంఘటన ఆదోని మండలం గణేకల్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మృతులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన రత్నాబాయి(50), ఈసన్న(45)గా గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బళ్లారికి చెందిన వస్త్రాల వ్యాపారి రవిరావు రత్నబాయి కుమార్తె వివాహం డిసెంబరు నాలుగోతేదీన ఖరారైంది. ఆ వివాహానికి సంబంధించి మొదటి పెళ్లి పత్రికను ఉరుకుంద ఈరన్నస్వామికి సమర్పించేందుకు కుమార్తె విద్యశ్రీ, కుమారుడు ఉరుకుంద ఈరన్నరావులతో బయల్దేరారు. ఆదోనికి వచ్చి అక్కడ ఆటోలో ఎక్కారు. చిత్రదుర్గలో ఓవివాహ కార్యక్రమానికి హాజరైన ఈశన్న, తన కోడలు అరుణతో కలసి అదే ఆటోలో ఆదోనిలో ఎక్కారు. వీరితో పాటు మరో నలుగురు కూడా ఉరుకుందకు బయల్దేరారు. డ్రైవర్‌తో సహా 11 మందితో వెళ్తున్న ఆటోను గణేకల్ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న మరో ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఆటోలోని ప్రయాణికులంతా చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ఘటనలో ఈశన్న అక్కడికక్కడే మృతి చెందగా రత్నబాయి ఆదోని ఆసుపత్రికి తరలించిన వెంటనే చనిపోయింది. అదేవిధంగా ఆటోలో ప్రయాణిస్తున్న బళ్లారికి చెందిన సుకుమార్, కుబేర్, రాజశేఖర్, ఉమాదేవి, డ్రైవర్ అయ్యప్ప, ఉరుకుంద ఈరన్నలు తీవ్రంగా గాయపడ్డారు. విద్యశ్రీ, రవిరావు స్వల్పంగా గాయపడ్డారు.


అంబులెన్స్‌లో తమ్ముడిని తరలిస్తున్న అక్క విద్యశ్రీ

విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా తల్లి రత్నబాయి మృతి చెందడంతో కుమార్తె విద్యశ్రీ, భర్త రవిరావు రోదనలు మిన్నంటాయి. మరో వైపు మృతురాలి కుమారుడు ఉరుకుంద ఈరన్న తీవ్రగాయాలతోనే 'మమ్మీ.. కావాలి..' అంటూ రోదించడం కలచివేసింది. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి


బాలిక కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వైసీపీ నాయకులు

పగిడ్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో నాలుగు నెలల క్రితం అత్యాచారం, హత్యకు గురైన బాలిక కుటుంబ సభ్యులను ఆదివారం వైసీపీ నాయకులు పరామర్శించారు. వైసీపీ అధిష్ఠానం పంపిన రూ.10లక్షల చెక్కును రాంభూపాల్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ అందజేశారు. రాంభూ పాల్ రెడ్డి మాట్లాడుతూ సీఎం, డిప్యూటి సీఎం, హోం మంత్రి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మహిళ ల రక్షణకు దిశ చట్టాన్ని తీసుకొచ్చి ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశామ న్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ముచ్చుమర్రిలో బాలిక హత్యాచారానికి గురై నాలుగు నెలలవుతున్నా మృతదేహాన్ని కూడా గుర్తించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, రమేష్ నాయుడు ఉన్నారు.

క్రషర్ మిషన్‌లో పడి యువకుడి మృతి

- రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో ఘటన


సురేష్ ఆచారి(ఫైల్)

కొలిమిగుండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల పరిధిలోని రామ్‌కో సిమెంటు పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలోని మట్టి క్రసర్ విభాగంలో అసిస్టెంట్ ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కడప జిల్లా మైలవరం మండలం ధన్నవాడ గ్రామానికి చెందిన వడ్ల సురేష్‌ఆచారి(28) నైట్ డ్యూటీలో విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు క్రసర్ మిషన్ మట్టిలో పడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రవికుమార్, సీఐ రమేష్‌బాబు పరిశీలించారు. సురేష్ ఆచారి గత సంవత్సర కాలంగా రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. తండ్రి మరణించగా తల్లి వడ్ల సుబ్బలక్ష్మమ్మ, సోదరుడితో కలిసి సురేష్‌ఆచారి జీవిస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. మృతి వార్త తెలుసుకున్న సురేష్ ఆచారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, పలువురు కడప జిల్లా నాయకులు కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీంతో పోలీసుల సూచన మేరకు పరిశ్రమ వర్గాలు బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి, రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

12వ పీఆర్సీని అమలు చేయాలి

ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

నంద్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల 12వ పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. నంద్యాలలోని ఎస్టీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు ప్రభుత్వ ఉద్యోగులకు టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఆర్సీ అమలు ఆలస్యం అవడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్ట పోతు న్నారని, 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించి నష్టనివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టీ టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. గౌరవాధ్యక్షుడిగా కేశాలు నాయక్, జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా రాము, ఉపాధ్యక్షులుగా దేవేంద్రుడు, రాంబాలాజీనాయక్, తిక్కస్వామి, విజయ కుమార్, అదనపు కార్యదర్శిగా పక్కీరయ్య, కార్యదర్శిగా రవీంద్రబాబు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జవహర్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్, సంయుక్త కార్యదర్శి మాతృనాయక్ పాల్గొన్నారు.

కొత్తూరులో ఎమ్మెల్యే గౌరు దంపతుల పూజలు



ఎమ్మెల్యే గౌరు దంపతులను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా వారు స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈవో రామకృష్ణ ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు. ఆలయంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, లక్షినారాయణ, నాగేశ్వరరావు, అర్చకులు వీరయ్యస్వామి, నారాయణ స్వామి, సురేష్‌శర్మ, కిట్టయ్య, రోహిత్ శర్మ, టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, మిలిటరీ సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానందిలో సామూహిక అభిషేకం

- నేడు కార్తిక మాస తొలి సోమవారం
- విద్యుద్దీపాలంకరణలో ఆలయం



సామూహిక అభిషేకంలో పాల్గొన్న భక్తులు



విద్యుద్దీపాలంకరణలో మహానంది క్షేత్రం

మహానంది, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మహానందిలో భక్తుల సందడి కొనసాగుతోంది. అందులో భాగంగా ఆదివారం సెలవురోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ మేరకు భక్తులు ఆలయానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్థానిక అలంకార మండపంలో సామూహిక రుద్రాభిషేకంలో భక్తులు పాల్గొన్నారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, పండితులు భక్తులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీకమాసం మొదటి సోమవారం భక్తుల రద్దీ పెరిగే అవకాశాలు ఉన్నాయి.కార్తీకమాసం సందర్భంగా మహానంది ఆలయ గోపురాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి.

'టీడీపీ సభ్యత్వం తీసుకోవాలి'

పాణ్యం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో ఎంతో ఉపయోగం ఉంటుందని, సభ్యత్వం తీసుకోవాలని ముస్లిం మైనార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖాదర్‌బాషా సూచించారు. ఆదివారం ఇందిరానగర్‌లోని చెంచులతో టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వంద రూపాయల సభ్యత్వంతో ప్రమాద బీమా రూ.5 లక్షల బీమా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ మాజీ కార్యదర్శి మహబూబ్‌బాషా, కృష్ణ, సుబ్బయ్య, చెంచులు పాల్గొన్నారు.

గడివేముల: కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. మండలంలోని దుర్వేసి గ్రామంలో ఆదివారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వంద రూపాయలతో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల వరకు ప్రమాదబీమా, కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్య సాయం అందుతుందని అన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. ఐటీడీపీ బీవీఎస్ రాజు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో ఎంపీటీసీ మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ కార్యకర్తలు సభ్యత నమోదు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫరూక్, శ్రీను తదితరులు ఉన్నారు.

కల్తీ నెయ్యి స్వాధీనం

నందికొట్కూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలంలోని కోళ్ళబావాపురం గ్రామంలో ఆదివారం నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడులలో 30 లీటర్ల కల్తీ నెయ్యి, 30 లీటర్ల సారా, నెంబర్ ప్లేట్లు లేని, సరైన రికార్డులు లేని మూడు ఆటోలను, 9 మోటర్ సైకిళ్లను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రాముడు అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని సీఐ చెప్పారు. పట్టుబడ్డ కల్తీ నెయ్యిపై విచారణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మిడుతూరు ఎస్ఐ ఓబులేసు, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- పాణ్యం మండలంలో ఒకే రోజు నాలుగు ఘటనలు

పాణ్యం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఒకే రోజు నాలుగు రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. స్థానిక డొంగు వద్ద తెల్లవారుజామున డివైడర్‌ను గోధుమపిండి లోడుతో వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. అలాగే తమ్మరాజుపల్లె వద్ద బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె వెళ్తున్న ట్రాక్టరు వంతెనను ఢీకొట్టింది. కేఎంసీ వద్ద తెల్లవారుజామున కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పి పక్కనున్న గుంతలో పడినట్లు తెలిపారు. ఈ ప్రమాదాలలో ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. పాణ్యం ఫ్లైఓవర్‌పై రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో రోడ్డుకు వ్యతిరేకంగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న జీపు ఢీకొనడంతో మోటారుసైకిల్ జీపు కిందకు వెళ్లి వ్యక్తి పక్కనున్న డివైడర్‌పై పడి మృతి చెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో లోకకళ్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేసి పల్లకీలో ఆసీనులనుజేసి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు. ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన రితువర్ణ కూచిపూడి నాట్యాలయం బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసింది.

పేదల వైద్యానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, గౌరు వెంకటరెడ్డి

నందికొట్కూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో ఉషారాణికి వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.7 లక్షల చెక్కు మంజూరయింది. చెక్కును ఉషారాణి కుటుంబ సభ్యులకు ఆదివారం ఎమ్మెల్యే జయసూర్య, గౌరు వెంకటరెడ్డి అందజేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేదలను అన్ని రకాలుగా ఆదుకుంటామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుతున్నామని చెప్పారు. నాయకులు సింగిల్ విండో మాజీ చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రఘురామిరెడ్డి, జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

నందికొట్కూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేసి జవ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి, చౌడేశ్వరి సేవా సమితి సభ్యులు మానవత్వాన్ని చాటుకు న్నారు. పట్టణంలోని కోటా వీధిలో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏడు సంవత్సరాల నుంచి ఉంటున్న సంజప్ప అనే సాధువు శనివారం రాత్రి 10 గంటలకు మరణించారు. దీంతో కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి పోలీసుశాఖకు, మున్సిపల్ కమిషనర్‌కు స్వచ్ఛంద సంస్థలకు సమా చారం ఇచ్చారు. దీంతో మున్సిపల్ అధికా రులు జేసీబీని పంపగా జవ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి సభ్యులు శ్రీకాంత్ గౌడ్, ఆర్టు శ్రీనివాసులు, చౌడేశ్వరి సేవా సమితి సభ్యులు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

వెదురు కలప పట్టివేత

బండిఆత్మకూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓంకారం, నారపు రెడ్డి కుంట సెక్షన్లలో వెదురు కలపను పట్టుకున్నట్లు బండిఆత్మకూరు రేంజ్ ఆఫీసర్ నజీర్‌ఝా తెలిపారు. ఆయా సమా చారం మేరకు అటవీ సిబ్బంది ఆదివారం వేకువ జామున దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెదురు కలప, రవాణా చేసే సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సదరు కలపను గాజులపల్లె డిపోకు తరలించామని ఎఫ్ఆర్వో అన్నారు.

హెల్త్ కార్డుల పంపిణీ

నంద్యాల రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి నగర్‌లోని దుకాణంలో ఆదివారం రెడీమేడ్ మర్చెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుకాణదారులకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పబ్బతి వేణుగోపాల్ హెల్త్ కార్డులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలక్రమేణ సంభవిస్తున్న రోగాలను నయం చేసుకోవాలంటే లక్షలలో ఖర్చు అవుతుందన్నారు. హెల్త్‌కార్డులు ఉంటే వైద్యం అందరికీ అందు బాటులో ఉంటుందని పేర్కొన్నారు. అసోసియేషన్ నిర్వహణ ఖర్చుల కోసం రూ.60 వేలు నగదును అందజేశారు.

నేడు బీజేపీ జిల్లా కార్యశాల

నంద్యాల కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో సోమవారం ఉదయం 10 గంటలకు బీజేపీ జిల్లా కార్యశాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు తెలిపారు. రాష్ట్ర నాయకుడు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కాబట్టి ఈ సమావేశంనకు జిల్లాలోని జాతీయ కార్యవర్గసభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా పదాధికారులు, మోర్చాల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్లు, కో ఆర్డినేటర్‌లు, మండల అధ్యక్షులు, ముఖ్యనాయకులు హాజరు కావాలని కోరారు.

'అల్లర్లకు పాల్పడితే చర్యలు'



భోజనం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

బండిఆత్మకూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనవసరంగా గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ జగన్మోహన్ హెచ్చరించారు. మండలంలోని భోజనం గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలువురి ఇళ్లల్లో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్థులతో ఎస్ఐ మాట్లాడుతూ పచ్చని పల్లెలో ప్రశాంతంగా జీవించాలని, ఎవరి కోసమో జీవితాలు బలి చేసుకోవద్దని సూచించారు.

జాతీయ చిత్రకళ ప్రదర్శనలో కోటేష్‌కు ప్రథమ బహుమతి



అవార్డు అందుకుంటున్న చింతలపల్లె కోటేష్

నంద్యాల కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన కళాకారుడు కోటేష్ వేసిన దేవసుర చిత్రానికి జాతీయ చిత్రకళ ప్రదర్శనలో ప్రథమ బహుమతి వచ్చింది. ఆదివారం ఒంగోలులోని డా.బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో కళాయజ్ఞ సృష్టి ఆర్ట్ అకాడమీ వారు ప్రాచీనభారత్ అనే అంశంపై పెయింటింగ్ పోటీలు, చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. కోటేˆగీసిన చిత్రానికి చిత్రకళాభారతి అవార్డు వచ్చింది. ఈ అవార్డు కింద రూ.10,116 నగదు, మెమెంటో ఇచ్చి సత్కరించారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'

నందికొట్కూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ ఆరోపించారు. ఆదివారం నందికొట్కూరు శ్రీనంది జూనియర్ కళాశాలలో సీపీఎం నందికొట్కూరు మండల మూడో మహాసభ మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించారు. రమేష్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం మత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మండల కార్యదర్శిగా నాగేశ్వరావు, కమిటీ సభ్యులుగా టి.గోపాల కృష్ణ, బెస్తరాజు, కొంగర వెంకటేశ్వర్లు, డీవీ నాయక్, షేక్ కాజాబాషా, దూదేకుల బాబు, బోయ పాండు, జయరాని, నజురున్నిస్సా, బోయ మధు, మదర్ బీను మొత్తం 12 మందితో మండల కమిటీని ఏర్పాటు చేశారు.

'అన్ని రంగాల్లో రాణించాలి'

వెలుగోడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్యులు అన్ని రంగాలలో రాణించాలని నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం వెలుగోడులో లక్ష్మీప్రసన్నన వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మించిన కళ్యాణ మండపం, కాశీ అన్నపూర్ణ వాసవి ఆర్యవైశ్య వృద్ధాశ్రమం, అధ్యక్షులు, నంద్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి శ్రీనివాస్‌తో కలసి ప్రారంభిం చారు. బీవీ సత్యనారాయణ, నర్సయ్య, రాము, సంజీవ రాయ ప్రసాద్, నాగార్జున, సుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, రామ్మోహన్, రవి ప్రసాద్, నాగరాజు, నాగేశ్వరరావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'



జిల్లాస్థాయి షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వేణుగోపాల్

ఆత్మకూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని టీడీపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్ అన్నారు. ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్సీల్ మున్నా, నాయకులు నూర్‌బేగ్, మోటారు షఫీవుల్లా, అసద్దుల్లా, మునీర్‌బాషా, తైక్వాండో శిక్షకులు ఖాజా హుసేన్, స్వామన్న తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



మిడుతూరులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రమేష్ రెడ్డి

మిడుతూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలో నూతన సీసీ రోడ్ల పనులను టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. పల్లెపండగ పంచాయతీ వారోత్సవంలో భాగంగా మిడుతూరులో నాలుగు సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. నాగేశ్వరరెడ్డి, నారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

27 మందికి మెరిట్ స్కాలర్‌షిప్

నంద్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఉర్దూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 27మంది విద్యార్థినులు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుకున్నారు. ఆదివారం కళాశాల ఆవరణలో ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ కరీముల్లా అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. శ్రీరామ ఫైనాన్స్ చీఫ్ మేనేజర్ అయూబ్‌బాషా మెరిట్ విద్యార్థినులకు రూ.4,500 చొప్పున 27మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ను అందజేశారు. దేశ వ్యాప్తంగా శ్రీరామ ఫైనాన్స్ ఏర్పాటు చేస్తున్న స్కాలర్‌షిప్‌లో భాగంగా నంద్యాలలో 8నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా జీత్‌కునేడో కరాటే సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి కరాటే పోటీలు ప్రారంభమయ్యాయి. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా. రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కరాటే సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ డైరెక్టర్ బాలకృష్ణ, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, కార్యదర్శి రమేష్ కరాటే మాస్టర్లు నూర్‌బాషా, రామకృష్ణ, జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు


సూచనలిస్తున్న రూరల్ సీఐ కంభగిరి రాముడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంభగిరి రాముడు హెచ్చరించారు. రూరల్ పరిధిలోని అహోబిలం గ్రామంలో పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, ప్రాంతాలతో పాటు రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

● అవుకు స్టేషన్ పరిధిలోని గడ్డమేకలపల్లి కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అనుమానితులు, నేరచరిత్రగలవారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించి సరైన ధృవపత్రాల్లేని సుమారు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


శెట్టివీడులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

చాగలమర్రి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామంలో వెలసిన మార్తోమా చర్చి 26 వార్షికోత్సవం సందర్భంగా వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఆదివారం ఫాదర్లు మాథ్యూ, మాస్టర్ ప్రేమ్‌కుమార్, దాతలు కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన 18 జట్లు పాల్గొంటున్నాయని అన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7,500, మూడవ బహుమతి రూ.5 వేలు నగదు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో దాతలు నరసింహారెడ్డి, మాబుషరీఫ్, మాబాషా, బికారి, రాధిక, టీఎస్‌బాష, ఆర్గనైజర్లు షాలమ్, రాముడు, నరసింహా, క్రీడాకారులు పాల్గొన్నారు.

లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం


లారీ మీద పడిన విద్యుత్ స్తంభం తీగలు

రుద్రవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రుద్రవరంలో శనివారం అర్ధరాత్రి మొక్కజొన్నల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న టిప్పరును తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని తగిలింది. దాంతో స్తంభం విరిగి లారీపై పడిందని స్థానికులు ఆదివారం వాపోయారు. పెను ప్రమాదం త్రుటిలో తప్పిపోయిందని స్థానికులు వాపోయారు. రాత్రి అంతా రుద్రవరంలో ఒక ప్రాంతానికి విద్యుత్ సరఫరా లేకపోడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ అధికారులు ఆదివారం ఉదయం విరిగిపడ్డ స్తంభాన్ని లారీపై నుంచి తొలగించి కొత్తస్తంభం ఏర్పాటు చేయించి తీగలు సరిచేయడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

బొప్పాయిలో అంతర్ పంటగా బంతిపూలు


ఆలమూరులో బొప్పాయి తోటలో బంతిపూలు

రుద్రవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు గ్రామంలో హుసేని అనే రైతు బొప్పాయిపంటలో బంతిపూల సాగును అంతరపంటగా సాగు చేశారు. ఒకటిన్నర ఎకరాలో బొప్పాయిసాగు చేసి అందులో బంతిపూల మొక్కలు నాటారు. ఒకే సమయంలో రెండు పంటల నుంచి ఆదాయం పొందేలా వ్యవసాయాన్ని చేస్తున్నారు. బంతిపూలను ఆలమూరు నుంచి తమిళనాడుకు సరఫరా చేస్తున్నాడు. కిలో రూ.30 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. బంతిపూలు పంట పూర్తయ్యేసరికి బొప్పాయి పంట వస్తుందని రైతు తెలిపారు.

రబీ గట్టెక్కించేనా..?

- ఉమ్మడి జిల్లా రబీ సాధారణ సాగు 3,20,525 హెక్టార్లు
- ఇందులో 4 లక్షల ఎకరాల్లో పప్పు శనగ సాగుకు రైతన్న సిద్ధం
- కొన్ని చోట్ల విత్తనం ప్రారంభించిన రైతులు

కొలిమిగుండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగు రైతన్నలకు కష్టాలనే మిగిల్చింది. కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పూర్తి స్థాయిలో సాగుకు నోచుకోక పోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో సాగుచేసిన పంటలు ఎండిపోవడం, ఇంకొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రారంభమైన రబీ సాగు అయినా రైతన్నను గట్టెక్కిస్తుందా? అనే సందేహం రైతుల్లో నెలకొన్నది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉమ్మ డి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కు రిసిన వర్షాలతో రబీ సాగుకు రైతన్నలు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యారు. రబీ సాగుకు అనుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడటంతో ఉమ్మడి జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 3లక్షల హెక్టార్లకు పైగా పూర్తి స్థాయిలో సాగు అయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా పప్పు శనగ సాగు 4లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉండటంతో ఆ దిశగా వ్యవసాయశాఖ ఇప్పటికే పూర్తి స్థాయిలో కసరత్తు చేపట్టి, సబ్సిడీ శనగ విత్తనాలు, ఎరువులు సైతం రైతులకు పంపిణీ చేశారు. జిల్లా శనగ సాగు విస్తీర్ణంలో అత్యధికంగా కోవెలకుంట్ల, బనగానపల్లె వ్యవసాయ డివిజన్లలోనే రైతులు సాగు చేస్తారని అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పప్పు శనగ సాగుచేశారు. మరి కొన్ని ప్రాంతాల్లో శనగ సాగును రైతులు ప్రారంభిస్తున్నారు. శనగతో పాటు జొన్న, వేరుశనగ, మినుము, కంది, నూగు, వరి, మిరప తదితర పంటలను అన్నదాతలు రబీ సీజన్‌లో సాగు చేస్తారు. కోవెలకుంట్ల డివిజన్‌లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొలాల్లో తడి ఆరకపోవడంతో రైతులు పప్పు శనగ సాగును ప్రారంభిస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు సాగితే శనగ సాగే రైతన్నను ఆదుకునే అవకాశం ఉంటుందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.


శనగ విత్తనాలు వేస్తున్న రైతులు


మొలకెత్తిన పప్పు శనగ

ఆందోళన చెందొద్దు

రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నవంబరు 15 వరకు పప్పు శనగ పంటతో పాటు, ఇతర రబీ పంటలను సాగు చేసుకునే అవకాశం ఉంది. సాగు సమయంలో విత్తన శుద్ధి, ఇతర జాగ్రత్తలు పాటిస్తే, మంచి దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

- సుధాకర్, ఏడీఏ, వ్యవసాయ శాఖ

ఇరుముడితో పాదయాత్ర


శబరిమలకు ఇరుముడితో పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప మాలధారులు

చాగలమర్రి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్పస్వామి ఆలయంలో దీక్ష చేపట్టిన అయ్యప్ప మాలధారులు గురుస్వామి, వాసు ఆధ్వర్యంలో ఆదివారం ఇరుముడితో శమరిమలకు బయలుదేరి వెళ్లారు. ఈనెల 29న శబరిమలకు చేరి అయ్యప్ప స్వామిని దర్శించుకొని పాదయాత్ర ముగిస్తామని మాలదారులు తెలిపారు.

అమ్మవారికి సామూహిక వడి బియ్యం


చాగలమర్రిలో అమ్మవారికి సామూహిక వడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాతశివాలయం, సత్యమ్మ దేవాలయంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకమాసం సందర్భంగా అమ్మవారికి సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. పసుపు, కుంకుమ, గాజులు, బియ్యం, పండ్లు సమర్పించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా విష్ణు సహస్రపారాయణం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. వెల్లాల క్షేత్రంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఆకాశ దీపానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'న్యాయవాదులకు రక్షణ కల్పించాలి'

డోన్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డోన్ బార్ అసోసియేషన్ మాజీ కోశాధికారి పులి దామోదర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలతో తరహా ఆంధ్ర ప్రదేశ్‌లో న్యాయవాదులకు ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రంలోని 26 బార్ అసోసియేషన్లకు మెమోరాండం పంపినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేలా జిల్లాల బార్ అసోసియేషన్ నాయకులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

కంప చెట్లు తొలగింపు


ఆలయ పరిసరాల్లో ముళ్లకంప తొలగింపును పరిశీలిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేశ్

డోన్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ పరిసరాల్లో కంప చెట్ల తొలగింపునకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్ చర్యలు తీసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని మున్సిపల్ సిబ్బందిని చైర్మన్ ఆదేశించారు. ఆయన ఆలయ పరిసరాల్లో ఉన్న పరిసరాలను ఆయన పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది ముళ్లకంపలను తొలగించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ జాకీర్‌హుశేన్, వివిధ వార్డుల కౌన్సిలర్లు ఉన్నారు.

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు


డబ్ల్యూ.గోవిందిన్నెలో వెలసిన మూలపెద్దమ్మ

దొర్నిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కులమతాలకు అతీతంగా అమ్మవారికి కాయకర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు.

చల్లా భగీరథరెడ్డికి నివాళి


చల్లా భగీరథరెడ్డి ఘాట్‌కు నివాళులర్పిస్తున్న చల్లా శ్రీలక్ష్మి, కుమారులు

అవుకు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి ద్వితీయ వర్ధంతిని ఆయన సతీమణి అవుకు మండల జడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఉదయం కుమారులు చల్లా రాజ్యాభిషేక్‌రెడ్డి, చల్లా రామక్రిష్ణారెడ్డితో కలిసి చల్లా ఘాట్ వద్దకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో చల్లా అభిమానులు పాల్గొన్నారు.

వరిపంటపై గడ్డిమందు పిచికారి


గడ్డిమందు పిచికారి చేయడంతో ఎండిన వరిపైరు

రుద్రవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన జల్లి చిన్నసర్వడు అనే రైతు రెండు ఎకరాల్లో సాగు చేసిన వరిపంటపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు గడ్డిమందు పిచికారి చేసినట్లు ఆదివారం ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ రమీజాబి, జమాల్‌బాషా, హుసేన్‌బాషా అనే ముగ్గురు తల్లికొడుకులు కలిసి గడ్డిమందు పిచికారి చేశారన్నారు. దాంతో రూ.1.40 లక్షలు పంట నష్టం వాటిల్లిందన్నారు. బాధిత రైతు చిన్నసర్వడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో గ్రామాల్లోని రౌడీషీటర్లకు, సస్పెక్టెడ్ రౌడీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని, ఇరువర్గాలు రాజీమార్గాన వెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

కేపీ ఉల్లికి తెగుళ్లు

- వెయ్యి ఎకరాల్లో దెబ్బతిన్న ఉల్లి పంట
- ట్రాక్టర్‌తో దున్నేసిన రైతులు
- నష్టపోయాం ఆదుకోవాలంటూ రైతుల వేడుకోలు

చాగలమర్రి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. ఈ ఏడాది ఎన్నో ఆశలతో సాగు చేసిన కేపీ ఉల్లి పంటతోనైన గట్టెక్కుతామన్న రైతులకు నిరాశే మిగిలింది. అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల సాగు చేసిన కేపీ ఉల్లి (క్రిష్ణాపురం ఉల్లి) పంట దెబ్బతిని రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఆదివారం చింతలచెరువు, కొలుములపేట, చిన్నవంగలి గ్రామాల్లో రైతులు ఉల్లి పంటను ట్రాక్టర్లతో దున్నేశారు. కొందరు రైతులు గొర్రెలు, మేకలకు మేతకు వదిలేశారు. కొలుములపేటలో కేపీ ఉల్లిపై గడ్డిమందు పిచికారి చేశారు. ఎంతో ఆశతో సాగు చేసిన కేపీ ఉల్లి అధిక వర్షాలు, వైరస్ వల్ల దెబ్బతిని పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు ఆవేదన చెంది పంటను తొలగించారు. లక్షలాది రూపాయలు పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చిన్నవంగలి, కొత్తపల్లె, మూడురాళ్లపల్లె, ఆవులపల్లె తదితర గ్రామాల్లో 1,000 ఎకరాలకు పైగా కేపీ ఉల్లి పంటను సాగు చేశారు. అధిక వర్షాలు, వైరస్ వల్ల పంట దెబ్బతిని ఉల్లి మొక్కలు కుళ్లిపోవడంతో రైతులు దిగాలు చెందారు. దాదాపు రూ.2 కోట్లు పైగా నష్టం వాటిల్లిందని, పెట్టుబడులు కూడా రావని, దీంతో కేపీ ఉల్లి పంటను తొలగిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. దెబ్బతిన్న ఉల్లి పంటను అధికారులు పరిశీలించి నష్టపరిహారం అంచనా వేయాలని కోరారు.


చింతలచెరువులో కేపీ ఉల్లిని ట్రాక్టర్‌తో దున్నేస్తున్న రైతు


కొలుములపేటలో గొర్రెలకు మేతగా వదిలేసిన ఉల్లి పంట

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కుడా పరిధిలో 3,480 ఇళ్లు పూర్తి

బనగానపల్లె హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి



బనగానపల్లె, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): పేదవారికి సొంతిల్లు కట్టించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి అన్నారు. కుడా కింద 3480 ఇళ్లు పూర్తి చేశామన్నారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: కుడా కింద బనగానపల్లె నియోజకర్గంలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి?

జవాబు: 2022లో బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 5975 ఇళ్లు మంజూరయ్యాయి. బనగానపల్లె మండలానికి 1528, కోవెలకుంట్లకు 1492, అవుకు 410, కొలిమిగుండ్లకు 1304, సంజామలకు 1241 ఇళ్లు మంజూరయ్యాయి.

ప్రశ్న: కుడా(కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కింద ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి?

జవాబు: కుడా కింద ప్రస్తుతం బనగానపల్లె నియోజవకర్గంలోని 5 మండలాల్లో 3480 ఇళ్లు పూర్తయ్యాయి. మిగతా ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇళ్లు నిర్మించుంటున్న లబ్ధిదారులకు బిల్లులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పడుతున్నాయి. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి.

ప్రశ్న: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద నియోజకవర్గానికి ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి?

జవాబు: ఈ పథకం కింద బనగానపల్లె నియోజకర్గానికి 4123 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు కేవలం 533 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి.

ప్రశ్న: ఎన్‌టీఆర్ హౌసింగ్ కింద బిల్లులు మంజూరయ్యాయా?

జవాబు: ఎన్‌టీఆర్ హౌసింగ్ కింద 2014-2019 సంవత్సరాల మధ్య 3127 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో కొంత మందికి మాత్రమే బిల్లులు పడ్డాయి. అందుకే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల ఇళ్లను జియో ట్యాగింగ్ చేస్తున్నాం. వివరాలను ప్రభుత్వానికి పంపాం. త్వరలో నిధులు మంజూరు కానున్నాయి.

నేడు మండలాల్లో మంత్రి పర్యటన

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో పర్యటించనున్నట్లు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ఆదివారం తెలిపారు. కోవెలకుంట్ల ప్రభుత్వ అతిథి గృహంలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే సంజామల మండల టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 3గంటల నుంచి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు మంత్రిని కలిసి తమ సమస్యలను వినతుల ద్వారా తెలియజేయవచ్చన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం, కొండమాయపల్లె చిన్నకంబలూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించారు. గ్రామదేవతలను పూజిస్తే పాడిపంట చల్లగా ఉంటుందని నమ్మకం వ్యక్తం చేశారు.

లింగమయ్యకు..

రుద్రవరం: మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువై ఉన్న లింగమయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రేపు వెల్లాల క్షేత్రంలో వేలం

చాగలమర్రి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో వెలసిన వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాలకు సంబంధించి భక్తులు సమర్పించిన వివిధ వస్తువులకు ఈనెల 5న వేలం నిర్వహించనున్నట్లు ఈవో నర్సయ్య ఆదివారం తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు డిపాజిట్ చెల్లించాలని అన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

రుద్రవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ గ్రామంలో మోటారు సైకిల్ చోరీకి గురైనట్లు బాధితుడు దేరంగుల మద్దిలేటి ఆదివారం ఫిర్యాదు చేశాడు. అక్టోబరు 24న తన ఇంటి వద్ద నిలిపిన వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినారని, దాని విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని పేర్కొన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

- కేసు నమోదు

దొర్నిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన సుబ్బయ్య అనే వ్యక్తి నుంచి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో మట్కా, జూదం, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.